# శ్రీ సత్యసాయి విద్యాసంస్థలకు మార్గదర్శక సూత్రాలు

(నవంబరు 21వ తేదీన ప్రశాంతినిలయంలో జరిగిన శ్రీ సత్యసాయి విద్యాసంస్థల ప్రపంచ సమ్మేళనం ముగింపు సమావేశంలో ప్రతినిధులు వ్యక్తం చేసిన సందేహాలకు శ్రీవారు అనుగ్రహించిన సమాధానాలను ఈ క్రింద ప్రచురిస్తున్నాము)

**తలచినట్టి పనులు తారుమారైనచో**
**తొణకవలదు ఎవరు బెణకవలదు**
**చీకు చింత వీడి చిరునవ్వు నవ్విన**
**అతడె గుండె వండినట్టివాడు!**

ప్రశ్న : **స్వామి! మతము, ఆధ్యాత్మికము మరియు ఎద్యుకేర్‌ల మధ్యగల సంబంధమును గురించి తెలియజేయవలసిందిగా కోరుతున్నాము.**

ప్రేమస్వరూపులారా! మతము, ఆధ్యాత్మికము, మరియు ఎద్యుకేర్‌ల మధ్యగల సంబంధ బాంధవ్యమును మీరింకా గుర్తించలేదంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉన్నది. ముందు Religion (మతము) అంటే ఏమిటో అర్థం చేసుకోండి. To realize is religion. దేన్ని realize చేయాలి? మీరెవరో మొట్టమొదట తెలుసుకోవాలి. అప్పుడే మీకు మతమంటే ఏమిటో చక్కగా అర్థమౌతుంది. ఆధ్యాత్మికమంటే ఏమిటి? భజనలు చేయటం, పూజలు చేయటం, దేవాలయాలను సందర్శించటం, తీర్థయాత్రలు సల్పటం.... ఇత్యాది సత్కర్మలన్నీ ఆధ్యాత్మికానికి సంబంధించినవని మీరు భావిస్తున్నారు. ఆధ్యాత్మికమంటే ఇది కాదు. మీయందు ఏ ఆత్మ కలదో ఆ ఆత్మయే అందరియందు కలదనే సత్యాన్ని గుర్తించటమే ఆధ్యాత్మికం. అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించటమే ఆధ్యాత్మికం.

ఒక చిన్న ఉదాహరణ : కన్నులు మూసుకున్నప్పుడు మీకు ఎవ్వరూ కనిపించరు.

sri sathyasai vachanamrutam

కన్నులు తెరచినప్పుడు మీకు అనేక శిరస్సులు కనిపిస్తున్నాయి. కన్నులు మూసుకున్నప్పుడు ఈ శిరస్సులు ఎక్కడున్నాయి? కన్నులు తెరిచేటప్పటికి ఇవి ఎక్కడినుండి వచ్చాయి? వీరందరూ ఎవరు? ఈ శిరస్సులు ఎవరివి? అని విచారణ చేస్తే, ఈ శిరస్సులన్నీ మీ నేత్రమునందే ఉన్నాయని అర్థమౌతుంది. అన్ని భూతములూ మీయందే ఉన్నాయి, మీరు అన్ని భూతములందూ ఉన్నారు. ఇట్టి ఏకత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించటమే ఆధ్యాత్మికం. అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తింపజేస్తుంది ఆధ్యాత్మికం. ఆత్మ అందరియందు ఒక్కటిగానే ఉన్నది. కాని ఇది వేరువేరుగా ఉన్నదని మీరు భావించి ఏకత్వాన్ని భిన్నత్వం గావిస్తున్నారు. అందువల్లనే అనేక సందేహాలకు, అనుమానాలకు గురి అవుతున్నారు.

మతమునకు, ఆధ్యాత్మికమునకు మరియు ఎడ్యుకేర్‌కు మధ్య ఉన్న సంబంధమేమిటని మీరు అడిగారు. ఇవన్నీ ప్రేమనుండి ఆవిర్భవించినవే. ఈ మూడూ వేర్వేరు కాదు. నిన్ను నీవు Realize చేయటమే Religion (మతము). నిన్ను నీవు చూసుకోవటమే ఆధ్యాత్మికము. ఒక చిన్న ఉదాహరణ: "ఇది నా కర్చీఫ్" అన్నప్పుడు కర్చీఫ్ నాకంటే వేరుగా ఉన్నది కదా! అదేరీతిగా, "ఇవి నా చేతులు, ఇది నా దేహము" అన్నప్పుడు దేహము నాకంటే వేరుగా ఉండాలి కదా! మరి నేనెవరు? అని విచారణ చేయండి. దేహము ఒక పనిముట్టు. ఇది కేవలం మెటీరియల్స్‌యొక్క చేరిక. దీనికి మీరే మాస్టర్. Master the mind, be a master-mind అన్నారు. ఆ మాస్టరే ఆత్మ. ఆ ఆత్మయే అందరియందున్నది. అదే మీలో కూడా ఉన్నది. ఈ సత్యాన్ని గుర్తించినప్పుడు మీకు ఏకాత్మభావం సులభంగా అలవడుతుంది.

ఇంక, Educare (ఎడ్యుకేర్) అంటే ఏమిటి? ఎడ్యుకేర్ అంటే ఏమిటో తెలియనివారు Educated people (విద్యావంతులు) కాజాలరు. 'ఎడ్యుకేర్' అనేది లాటిన్ పదము. దీనినుండియే 'ఎడ్యుకేషన్' అనే ఇంగ్లీషు పదము ఏర్పడింది. 'ఎడ్యుకేషన్' అనగా బాహ్యప్రపంచమునుండి సంగ్రహించేది; 'ఎడ్యుకేర్' అనగా మనలోపలి నుండి వెలికితీసేది. మొదటిది జీవనోపాధికి అవసరం; రెండవది జీవితపరమావధికి అవసరం. మనకు తెలిసిన విషయాలను బయటినుండి సంగ్రహిస్తున్నాము. కాని, మనకు తెలియనివి ఎన్నో మన లోపల అగోచరంగా ఉన్నాయి. మీరు ప్రారంభంలో ABCD... అని అక్షరాలు నేర్చుకుంటారు. తరువాత G....O....D అనే అక్షరాలను చేర్చి 'గాడ్' అనే అర్థవంతమైన పదాన్ని వ్రాస్తారు.

srisathyasaivachanamrutam

అక్షరాలు పూర్వమే ఉన్నాయి. వాటిని పదములుగా కూర్చటానికి మీ ప్రయత్నం అవసరం. మనకు తెలియనివి ఎన్నో విషయాలు మనలోపల అగోచరంగా ఉన్నాయి. వాటిని మనం ప్రయత్నపూర్వకంగా బయటికి తీయాలి. అదే 'ఎద్యుకేర్'.

మీరు కొన్ని తప్పు పనులు చేసి ఉంటే, తప్పు పనులు చేసేవానిని చూసినప్పుడు మీలోని తప్పులు బయటికి వస్తాయి. మీరు మంచిపనులు చేసి ఉంటే, మంచిపనులు చేసేవానిని చూసినప్పుడు మీ మంచితనం బయటికి వస్తుంది. అనగా, మీలో ఉన్న మంచిచెడ్డలే మీకు ఎదుటి వ్యక్తిలో కనిపిస్తున్నాయి. మీరు ఒకరిని మంచివాడంటారు. అది అతని యందున్న మంచితనము కాదు, మీకు అతనిపై ఉన్న మంచిభావమే అతనిలో ప్రతిబింబిస్తున్నది. మీరు ఎవరినో చెడ్డవాడంటారు. అతను చెడ్డవాడు కాడు. మీకు అతనిపట్ల ఉన్న భావము చెడ్డది. మంచిచెడ్డలన్నీ అంతర్భావముయొక్క ప్రతి బింబములే. ఎవ్వరినీ మనం చెడ్డవారని భావించకూడదు. అసలు ఒకరు చెడ్డవారని చెప్పటానికి మీకు అధికారం లేదు. ఒక వ్యక్తివలన మీకు అపకారం జరిగితే మీరతనిని చెడ్డవాడంటున్నారు. కాని, అతనిలో ఎంత మంచితనం ఉందో మీకేమి తెలుసు.

ఒక చిన్న ఉదాహరణ : అనిల్‌కుమార్ ఇప్పుడు క్రీమ్ కలర్ షర్టు వేసుకున్నాడు, కళ్ళద్దాలు పెట్టుకున్నాడు, చేతిలో పెన్ను పట్టుకున్నాడు అని చెప్పినంతమాత్రమున మీరు అనిల్‌కుమార్ యొక్క స్వరూపాన్ని పూర్తిగా గుర్తించినవారవుతారా? మీరు అతని రంగును, Height (ఎత్తు)ను, Weight (బరువు)ను మాత్రమే చూడగల్గుతున్నారు. మీ కంటికి కనిపించని గుణాలు అతనియందు ఎన్ని ఉన్నాయో! అతనిలో దయ ఉండవచ్చును, ప్రేమ ఉండవచ్చును, క్రోధం ఉండవచ్చును. వీటన్నింటినీ గుర్తించినప్పుడే అతని పూర్తి స్వరూపం మీకు అర్థమౌతుంది. మనిషియొక్క ఆకారమునుబట్టి, అతను చేసే పనిని బట్టి అతని మంచిచెడ్డలను నిర్ణయించటం చాలా తప్పు. మీలో ఎలాంటి భావాలున్నాయో మీరలాంటి దృష్టితో చూస్తున్నారు. మీరు ఎరుపురంగు అద్దాలను ధరిస్తే, అందరూ ఎఱ్ఱగా కనిపిస్తారు. నీలిరంగు అద్దాలను ధరిస్తే అందరూ నీలంగా కనిపిస్తారు. అది మీ దృష్టిదోషమేగాని, సృష్టిదోషము కాదు. ఇలాంటి సత్యాన్ని గుర్తించని మూర్ఖుడే ఇతరులను విమర్శిస్తుంటాడు.

sri sathyasai vachanamrutam

ఎదుటి వ్యక్తియొక్క స్వభావాన్నే గుర్తించలేని మానవుడు మానవాతీతమైన దైవత్వాన్ని ఏరీతిగా అర్థం చేసుకోగలడు? భగవంతుని 'స్టోరు'లో వర్ణించటానికి వీలుకానంత విలువైనవి ఉన్నాయి. ఈ సత్యాన్ని గుర్తించలేక మీరు వచ్చి "స్వామీ! నాకొక లాకెట్ ఇవ్వండి" అంటారు. భగవంతుడు మీకెంత విలువైనవి ఇవ్వాలనుకుంటున్నాడో మీకేమి తెలుసు? అది మీరు గుర్తించుకోలేక అల్పమైన వస్తువులను కోరుతున్నారు. భగవంతుని 'స్టోరు'లో లేనటువంటిది లేదు; ఎంతో విలువైనవి ఉన్నాయి. వాటిని మీకు ఇవ్వాలనుకుంటున్నాడేమో! కాబట్టి భగవంతుణ్ణి ఏమీ కోరకూడదు. దేశకాల పరిస్థితుల ననుసరించి, సమయసందర్భాలను పురస్కరించుకొని భగవంతుడు మీకు అవసరమైనవి ఇస్తాడు. భగవత్తత్త్వాన్ని అర్థం చేసుకోలేని మూర్ఖులు యథార్థాన్ని విస్మరించి, అనర్థాలకు గురి అవుతారు.

ఎడ్యుకేర్‌గాని, ఆధ్యాత్మికముగాని, మతముగాని ప్రత్యేకమైనవి కావు. ఇదొక ఉంగరము, ఇదొక చైను, ఇవి కమ్మలు.... అని మీరు కేవలం రూపాలను మాత్రమే చూస్తున్నారు. వీటన్నింటిలో ఉన్నది బంగారమే అన్న సత్యాన్ని గుర్తిస్తే మీకు భేదాలు ఎందుకు వస్తాయి? అదేరీతిగా, దివ్యత్వము అనేక రూపనామములతో కనిపించవచ్చు. కాని అన్ని రూపనామములకు మూలాధారమైన ప్రేమ ఒక్కటే. కాబట్టి ప్రేమను ఇచ్చుకోండి, ప్రేమను పుచ్చుకోండి. మతము అనేదాన్ని ప్రక్కకు పెట్టండి. Religion (మతము) అంటే నిన్ను నీవు Realize చేయటం. ప్రేమద్వారానే ఇది సాధ్యం కనుక, ఉన్నది ఒకే మతము, అదే ప్రేమమతము (Religion of Love). 'ఎడ్యుకేర్' అంటే లోపలున్నదాన్ని వెలికి తీయటం. అనగా మీలో ఉన్న ప్రేమను బయటికి తీయటం. ఆ ప్రేమయే భక్తిగా రూపొందుతున్నది. ప్రేమయే దైవం, దైవమే ప్రేమ. ఇది మీరు మొట్టమొదట తెలుసుకుంటే, ఇంక ఎడ్యుకేర్ గురించిగాని, మతము గురించిగాని యోచించనక్కర్లేదు. అప్పుడే జగత్తులో జగడాలే ఉండవు. అందరూ ఐకమత్యంగా, ఆనందంగా ఉంటారు.

ఈనాడు ఒకరికొకరికి మధ్య భేదాలు పెరిగిపోవటంచేతనే జగడాలు ప్రారంభమౌతున్నాయి. జగడాలు లేకుండా ఆనందాన్ని అనుభవించాలంటే భేదాలను ప్రక్కకు నెట్టి ఏకాత్మభావాన్ని అలవర్చుకోవాలి. ఉన్నది ఒకే కులం, అదే మానవకులం; ఉన్నది ఒకే మతం, అదే ప్రేమమతం; ఉన్నది ఒకే భాష, అదే హృదయభాష. ఇట్టి ఏకత్వాన్ని గుర్తిస్తే

sri sathyasaivachanamrutam

జగడాలకు అవకాశమే ఉండదు. "అయ్యా, నీదే కులం? ఏ మతం?" అని ప్రశ్నలు వేయనక్కర్లేదు. "నేను మానవుడను, మానవజాతి అంతా ఒక్కటే" అనే సత్యాన్ని గుర్తించుకుంటే చాలు. మానవత్వాన్ని గుర్తించుకున్నప్పుడు ఇంక మతమనేది ప్రత్యేకంగా కనిపించదు. మతములు వేరైనా గమ్యం ఒక్కటే. ఆ గమ్యాన్ని మనం దృష్టిలో పెట్టుకుంటే మతములన్నీ ఒక్కటైపోతాయి.

"మతులు మంచివైన మతమేది చెడ్డది? వినుడు భారతీయ వీరసుతుడ!" మతిలోపల భేదాలు పెట్టుకొని మతములలో భేదాలున్నాయనుకోవటం చాలా పొరపాటు. మీరు మతమును చూడకూడదు, మీ మతిని చక్కదిద్దుకోవాలి. మతిపైననే గతి, స్థితి, సంపత్తి ఆధారపడియున్నాయి. ఏకత్వాన్ని అభివృద్ధిపరచుకోండి. అందరియందున్న ఆత్మతత్త్వం ఒక్కటే అన్న సత్యాన్ని విశ్వసించండి. అప్పుడే అన్ని భేదాలు దూరమై, మతమంటే ఏమిటి? ఎడ్యుకేర్ అంటే ఏమిటి? అనేవి సులభంగా అర్థమౌతాయి.

## ప్రశ్న : సత్యసాయి స్కూల్సు ప్రభుత్వంతో ఎలాంటి సంబంధమును పెట్టుకోవాలి?

మన సత్యసాయి సంస్థలో అందరికీ 'రైటు' (హక్కు) ఉన్నది. ఎందుకంటే సత్యసాయి అందరివాడు. కాని ప్రభుత్వంలో కొన్ని భేదాలుంటాయి. వారి 'సబ్జెక్టు'లు, 'ఆబ్జెక్టు'లు వేరుగా ఉంటాయి. అయితే గవర్నమెంటు రూల్సుకు మనం విరుద్ధంగా పోకూడదు. వాటిని తప్పక అనుసరించాలి. మన సంస్థలో ప్రేమయే ప్రధానమైనది. ప్రేమచేతనే మన రూల్సును మనం అనుసరిస్తాము. అందరినీ హృదయపూర్వకంగా ప్రేమిద్దాము. ప్రేమయే సాధనగా పెట్టుకుందాము. గవర్నమెంటు స్కూలులో చదువుతున్నప్పటికీ సత్యసాయి ఎడ్యుకేషన్‌ను అనుసరించవచ్చు. సత్యసాయి ఎడ్యుకేషన్‌లో మానవతావిలువలు ప్రధానమైనవి. కాబట్టి మీరు మొట్టమొదట మానవతావిలువలను నిలబెట్టుకోండి. దానితోపాటు గవర్నమెంటు ఎడ్యుకేషన్‌ను అనుసరించండి. అది వేరు, ఇది వేరు అనే భేదమును పాటించకూడదు. గవర్నమెంటుకి కొన్ని నియమనిబంధన లున్నాయి. వాటిని మీరు ధిక్కరించకూడదు. ఆ నియమ నిబంధనలను అనుసరించినప్పుడే గవర్నమెంటు వారు మీకు డిగ్రీ ఇస్తారు. ఆ డిగ్రీ ఉన్నప్పుడే మీకు ఉద్యోగాలు చిక్కుతాయి. కనుక దానిని కూడా మీరు అనుసరించాలి.

sri sathyasai vahinamrutam

దినములో 24 గంటలున్నాయి. అందులో ఉదయం మూడు గంటలు, మధ్యాహ్నం మూడు గంటలు... మొత్తం ఆరు గంటలు స్కూల్లో గడుపుతున్నారు. ఇంకా పద్దెనిమిది గంటలున్నాయి కదా! అందులో ఆరు గంటలు నిద్రకి, ఆరు గంటలు ఇతర పనులకు ఉపయోగించవచ్చు. మిగిలిన ఆరు గంటలు ఆధ్యాత్మిక సాధనకు, మానవతావిలువలను అభివృద్ధి చేసుకోవటానికి వినియోగించాలి. గవర్నమెంటు ఎడ్యుకేషన్ బుకిష్ నాలెడ్జికి సంబంధించినది, సత్యసాయి ఎడ్యుకేషన్ ప్రాక్టికల్ నాలెడ్జికి సంబంధించినది. ఇది సత్యమైన ఎడ్యుకేషన్. అయితే అది కేవలం బుకిష్ నాలెడ్జి కదాయని దానిని ప్రక్కకు నెట్టివేయకూడదు. అదికూడా అవసరమే. 'ఇహమున సుఖింప హేమతారక విద్య, పరమున సుఖింప బ్రహ్మవిద్య.' ఇహమునకు గవర్నమెంటు విద్య కావాలి, పరమునకు ఆధ్యాత్మికతత్త్వం అవసరం. ఈ రెండూ వేర్వేరని భావించకూడదు. ఇవి ఒకే నాణెముయొక్క రెండు ముఖములవంటివి. కాబట్టి రెండింటినీ మనం స్వీకరించాలి.

**ప్రశ్న : విద్యార్థుల మనస్సును మేము ఏవిధంగా అర్థంచేసుకోగలము?**

మొట్టమొదట మీ మనస్సునుగురించి మీరు తెలుసుకోండి. తరువాత విద్యార్థుల మనస్సును చూడవచ్చు. మీరు మంచిమనస్సును అభివృద్ధి చేసుకుంటే ఆ మంచితనం విద్యార్థులలో కూడా ప్రవేశిస్తుంది. విద్యార్థియొక్క మనస్సును చూడటానికి వీలుకాదు. కనుక అతని ప్రవర్తనను మీరు జాగ్రత్తగా గమనించాలి. బయట ఏవిధంగా ప్రవర్తిస్తున్నాడు? ఇంట్లో ఎలా ఉంటున్నాడు? స్కూల్లో ఏవిధంగా నడుచుకుంటున్నాడు? స్నేహితులతో ఎలా మెలగుతున్నాడు? ఇవన్నీ మీరు చక్కగా విచారణ చేయాలి. అప్పుడే మీరు ఆ విద్యార్థిని సరియైన మార్గంలో త్రిప్పటానికి వీలౌతుంది. ఈ ఆధునికయుగ ప్రభావంచేత తల్లిదండ్రులు పిల్లలకు మితిమీరిన స్వేచ్ఛనిస్తున్నారు; ఇష్టమొచ్చినట్లు డబ్బు ఇస్తున్నారు. ఈరీతిగా తొంభైతొమ్మిది శాతం తల్లిదండ్రులే పిల్లలను పాడుచేస్తున్నారు.

"నా పిల్లవానికి నేను స్వాతంత్ర్యమివ్వాలి. వానికీ ఒక మనస్సుంది. కాబట్టి వాడు తన ఇష్టానుసారం ప్రవర్తించవచ్చు" అని భావిస్తారు కొందరు. అయితే అలాంటి తల్లిదండ్రులు పిల్లవాడు చెడమార్గం పట్టినప్పుడు ఎందుకు ఏడుస్తున్నారు? వాడు తన ఇష్టానుసారం

srisathyasaivahini.com

ప్రవర్తిస్తున్నాడని సంతోషించాలి కదా! ఇదే తప్పు. పిల్లలను మొదటినుండియే అదుపులో పెట్టుకోవాలి. రోడ్డు బాగా ఉన్నప్పుడు, జనసంచారం లేనప్పుడు కారులో స్పీడుగా వెళ్ళవచ్చు. కాని జనం అధికంగా సంచరించేచోట ఎక్కువ మలుపులున్నచోట "స్పీడు బ్రేకర్లు" ఏర్పాటు చేస్తారు. ఎందుకోసం? అందరి క్షేమం కోసమే. అదేరీతిగా మనం పిల్లల స్వేచ్ఛకు కూడా కొంత బ్రేకులు వేయాలి. ఏ విషయంలో స్వేచ్ఛ ఇవ్వాలి? ఏ విషయంలో స్వేచ్ఛ ఇవ్వకూడదు? అనే విచక్షణను కలిగియుండాలి.

పిల్లవాడు పెడమార్గం పడితే కఠినమైన శిక్ష విధించాలి. అక్కడ స్వేచ్ఛ ఇవ్వకూడదు. మంచి విషయాలలో మాత్రం ఎంతైనా స్వేచ్ఛ ఇవ్వవచ్చును. కాని వెనుకనుండి జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. పిల్లలను సరియైన మార్గంలో పెట్టవలసిన బాధ్యత మొట్టమొదట తల్లిదండ్రులదే. కొడుకు బాధ్యత తండ్రిది, కూతురు బాధ్యత తల్లిది. ఎందుకంటే కూతురు ఎప్పుడూ తల్లినీడలోనే సంచరిస్తుంది. కాబట్టి ఆడపిల్ల సరిలేదంటే అది తల్లి తప్పు, మగపిల్లవాడు చెడిపోతే అది తండ్రి తప్పు.

స్కూల్లో టీచర్లు కూడా పిల్లలను మంచి మాటలతో సరియైన మార్గంలో పెట్టటానికి ప్రయత్నించాలి. "నాయనా! నీ ప్రవర్తన సరిగా లేకపోతే నీకు అపకీర్తి వస్తుంది. అంతేకాదు నీ తల్లిదండ్రుల పేరును, నీ వంశముయొక్క పేరును కూడా పాడుచేసినవాడవౌతావు. సత్ప్రవర్తనతో నీ తల్లిదండ్రుల పేరు నిలబెట్టు, నీవు చదువుతున్న స్కూలు పేరు నిలబెట్టు" అని బోధించాలి. విదేశాలలో చాలామంది పిల్లలకు వినయవిధేయత లంటే ఏమిటో తెలియదు. అలాంటి పిల్లలను మన సత్యసాయి సంస్థలవారు చేరదీసి వారికి వినయ విధేయతలను నేర్పించాలి. "నాయనా! ఒకరిని భయపెట్టుటకు నీవు మృగము కాదు, ఒకరిని భయపెట్టుటకు నీవు పశువు కాదు. భయపెట్టేది మృగము, భయపడేది పశువు. నీవు మానవుడిగా పుట్టావు. కాబట్టి నీవు భయపెట్టకూడదు, భయపడకూడదు" అని బోధించి వారిని సన్మార్గంలోకి త్రిప్పాలి. జీవితం ఒక దీర్ఘప్రయాణం. మానవుడు దీర్ఘకాలం జీవించవలసినవాడు. కాబట్టి దివ్యమైన జీవితాన్ని గడపాలి. దీర్ఘజీవితాన్ని కాదు, దివ్యజీవితాన్ని ఆశించాలి. ఈ విధంగా మంచి మాటలు చెప్పి పిల్లలను సరిదిద్దటానికి ప్రయత్నించాలి.

sri sathyasai vachanamrutam

మీరు మొట్టమొదట ఆచరించి తరువాత దానిని పిల్లలకు బోధించాలి. ఆచరించి బోధించేవాడే ఆచార్యుడు. అధ్యాపకుడు కాలేజిలో సిగరెట్టు త్రాగితే విద్యార్థి కూడా అదే పని చేస్తాడు. "ఏరా, నీవెందుకు సిగరెట్టు త్రాగుతున్నావు?" అని అడిగితే "సార్! మీరు కూడా అదే పని చేస్తున్నారు కదా!" అంటాడు. దానికి అధ్యాపకుడు ఏమి సమాధానం చెప్పుకోగలడు? నో రిప్లై! కాబట్టి విద్యార్థులకు మంచి అలవాట్లు నేర్పించాలంటే మొట్టమొదట అధ్యాపకుడు దురభ్యాసాలకు దూరంగా ఉండాలి. తాను మంచిని చేసి పిల్లలకు మంచిని బోధించాలి. అదే సరియైన ఉపదేశము. అప్పుడే విద్యార్థియొక్క మంచితనం బయటపడుతుంది. తాను చేసిన తప్పులకు పశ్చాత్తాపపడి "సార్! నాకు తెలియకుండా ఎన్నో తప్పులు చేశాను" అని చెప్పుకొని, ఆనాటినుండి వాడు మంచివాడుగా రూపొందుతాడు.

నేను పిల్లలను ఎంతగానో ప్రేమిస్తాను, వారికి కావలసినవి ఇస్తుంటాను. అయితే కొన్ని సమయాల్లో వారేదైనా తప్పు చేస్తే చాలా కఠినంగా ఉంటాను. అప్పుడు పిల్లలే వచ్చి "స్వామీ! మేము చేసింది తప్పు. మమ్మల్ని క్షమించండి. ఒకపైన ఇలాంటి తప్పు చేయము" అని అంటారు. ఆ మాటలకు స్వామి కరిగిపోతాడు. "నాయనా! ఇకనుండైనా మీ ప్రవర్తనను సరిదిద్దుకోండి. నేను ఏది చేసినా మీ మంచికోసమే" అని చెబుతాను. అధ్యాపకులు కూడా పిల్లలకు ఈరీతిగా బోధించాలి.

### ప్రశ్న : అధ్యాపకునికి ఉండవలసిన ముఖ్య లక్షణమేమిటి?

అధ్యాపకుడు తనకు ఏది మంచిదని తోస్తుందో దానిని పిల్లలకు బోధించి, తాను కూడా అనుసరిస్తూ రావాలి. పిల్లలకు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించాలి. దీనికొక చిన్న ఉదాహరణ చెబుతున్నాను. నేను మూడు, నాల్గు క్లాసులు చదువుతున్న రోజుల్లో మా స్కూల్లో అయ్యంగార్ అనే టీచరుండేవాడు. ఆ రోజుల్లో పిల్లలకు గురువును చూస్తే చాలా గౌరవము, భయముకూడా! అయ్యంగార్ ఎక్కడైనా బజారులో కనిపిస్తే చాలు, పిల్లలు భయంతో ఆయనకు కనిపించకుండా ప్రక్కసందులోనికి దూరేవారు. ఇది ఆయన కనిపెట్టాడు. ఒకరోజున నేను కూడా ఆయనను చూసి తప్పించుకున్నానని అపోహ పడ్డాడు.

sri sathyasai vahini vachanamrutam

మా క్లాసుకి నేనే మానిటర్‌గా ఉండేవాడిని. నేను ఇప్పుడే ఇంత 'పెద్ద'గా ఉన్నాను. ఆ రోజుల్లో ఇంకెంత ఉండేవాడినో మీరూహించుకోవచ్చు. ప్రతి రోజు అయ్యంగార్ మా క్లాసుకి వచ్చే ముందు నేనొక చింతబరికె తెచ్చి ఒక మూల పెట్టాలి. ఆరోజున ఆయన క్లాసుకి వస్తూనే కఱ్ఱ తీసుకొని "ఏయ్ రాజూ! ఇలా రా" అన్నాడు. నేను ధైర్యంగా వెళ్ళాను. ఎందుకంటే నేనేమీ తప్పు చేయలేదు. "నన్ను చూసి నీవెందుకు ప్రక్కసందులోకి దూరినావు?" అని అడిగాడు. "సార్! నేను మిమ్మల్ని చూడలేదు. ఆ పిల్లవాని ఇంట్లో నా నోటుబుక్కు ఉంది. దానిని తీసుకోవాలని వెళ్ళాను" అన్నాను. సత్యమే చెప్పాను. "నిజంగా చూడలేదా?" అని అరిచాడు. చూడలేదని చెప్పాను. "నిన్ను కొడతాను" అన్నాడు. "మీకు కొట్టాలనిపిస్తే కొట్టండి" అన్నాను.

నేను సత్యమే చెబుతున్నానని గుర్తించి ఆయన దగ్గరకి పిలిచి "రాజూ! నీవు అలాంటివాడవు కాదు. కాని ఏనాడూ తప్పు చేయని నీవు తప్పు చేస్తున్నావేమో అని కోపం వచ్చింది. నీవు తప్పు చేయవని నాకు తెలుసు. రేపటి దినము నీవు ఇంటికి వెళ్ళేటప్పుడు ఒకసారి మా ఇంటికి వచ్చి వెళ్ళు" అని చెప్పాడు. మా ఇంటికి వెళ్ళేదారిలోనే వాళ్ళ ఇల్లున్నది. ఆయన ఆజ్ఞప్రకారం మరునాడు వాళ్ళ ఇంటికి వెళ్ళాను. గురువాజ్ఞ లేకుండా లోపలికి ప్రవేశించకూడదని వరండాలో నిలబడినాను. ఆయన భార్యతో చెప్పినాడు "రాజు అనే పిల్లవాడు వస్తాడు, లోపలికి తీసుకురా" అని. ఆమె వచ్చి అడిగింది – "నాయనా! రాజు అంటే నీవేనా?" "అవునమ్మా!" అని చెప్పాను. "మీ సార్ పిలుస్తున్నారు, లోపలికిరా" అంది. లోపలికి వెళ్ళాను. ఆయన ప్రేమకు అవధులు లేవు. ఒక చిన్న అల్యూమినియం ప్లేటులో రెండు పకోడాలు పెట్టి "రాజూ! అనవసరంగా నిన్ను నేను కోప్పడ్డాను, కొట్టాలనుకున్నాను. ఆ తప్పుకు పరిహారంగా నీతో ఫ్రెండ్‌షిప్ చేసుకుంటున్నాను" అన్నాడు.

చూశారా! మన మంచితనము, మన పవిత్రమైన గుణములు, సత్యవాక్కులు ఎంతటివారినైనా కరిగిస్తాయి, కదిలిస్తాయి. "సార్! మీరెక్కడ, నేనెక్కడ! మీకు నాతో ఫ్రెండ్‌షిప్ ఏమిటి?" అన్నాను వినయంగా. అందుకు ఆయన "నాయనా! నీవు అటువంటి భేదము పెట్టుకోవద్దు. కనుకనే నేను నీతో ఫ్రెండ్‌షిప్ చేస్తున్నాను. వయస్సు, చదువు ప్రధానం కాదు; హృదయం ప్రధానం. నీవు చాలా మంచిపిల్లవాడివి" అన్నాడు. "నాయనా! బాగా

srisathyasaivacharamrutam

చదువుతున్నావా?" అని అడిగాడు. "చదువుతున్నాను సార్!" అన్నాను. "వచ్చే నెలలో పరీక్షలున్నాయి. బాగా చదువుకో" అని చెప్పాడు.

పరీక్షలు ప్రారంభమయ్యాయి. రెండు గంటలు టైమిచ్చారు. కాని నేను అరగంటలోనే జవాబులన్నీ వ్రాసి పేపర్‌ను అక్కడ పెట్టేశాను. ఇది గమనించి ఆయన "రాజూ! నీవేమీ వ్రాసినట్లు కనిపించలేదే!" అన్నాడు. "సార్! నేనన్నీ కరెక్టుగా వ్రాశాను. రేపు మీరే చూస్తారు కదా!" అన్నాను. మరునాడు ఆయన ఆ కట్టలో నుండి మొట్టమొదట నా పేపరును తీసి చూశాడు. అందులో ఆయనకు తెలియని విషయాలు కూడా ఉన్నాయి. ఆ పేపరు పైన 'వెరీ వెరీ వెరీ గుడ్' అని వ్రాశాడు. ఆ రోజుల్లో టీచర్లు మా పేపర్లను వారిదగ్గరే పెట్టుకునేవారు. తరువాతి రోజున నన్ను వాళ్ళ ఇంటికి పిలిచాడు. "రాజూ! కాఫీ తీసుకొని వెళ్ళు" అని చెప్పాడు. "సార్! నాకు నాకు కాఫీ, టీలు అలవాటు లేదు" అన్నాను. "పోనీ, ఒక దోసె అయినా తీసుకో" అన్నాడు. "ఈ సమయంలో నాకు తినటం అలవాటు లేదు సార్!" అన్నాను. "నాయనా! నా తృప్తికొరకైనా నీవు తీసుకో" అని కోరాడు. ఆయన తృప్తికోసం తీసుకున్నాను. ఈరీతిగా విద్యార్థులు తమ అధ్యాపకులకు ఆనందం కలిగించాలి. కొందరు పిల్లలు టీచర్లను చూస్తే భయపడిపోతారు. కాని నాకెప్పుడూ భయం లేదు. తప్పు చేయనప్పుడు ఎందుకు భయపడాలి?

ఇంగ్లీషు టీచరు మెహబూబ్‌ఖాన్‌కి కూడా నేనంటే చాలా ఇష్టం. ఆయన నా క్లాసుకి రావటానికి చాలా ఆతృత పడేవాడు. బెల్ కొట్టిన వెంటనే క్లాసుకి వచ్చేవాడు. క్లాసులో ఎవరైనా టీచరుంటే వెళ్ళిపొమ్మని తొందర పెట్టేవాడు. ఆయన క్లాసుకి వచ్చేసరికి పిల్లలందరూ "రాజూ! ముందుకు వెళ్లు" అంటూ నన్ను నెట్టేవారు. ఆయన నన్ను దగ్గరికి పిలిచి, ఆప్యాయంగా నా భుజం మీద చేయి వేసి, తల నిమిరేవాడు. అప్పటికి ఆయన వయస్సు 50 సంవత్సరాలు, పిల్లలు లేరు. అందుచేత, తరచుగా వాళ్ళ ఇంటికి రమ్మనేవాడు. అతడు చాలా గొప్పభక్తుడు "రాజూ! స్కూలులో ప్రతి రోజూ ప్రార్థనాగీతాన్ని నీవే పాడాలి. నీ పాట మా హృదయాన్ని కరిగిస్తుంది. ఆ పాటను కూడా నీవే వ్రాయాలి" అని కోరాడు. అప్పుడు నేను సర్వమత సమానత్వాన్ని ప్రబోధించే ప్రార్థనను వ్రాశాను. స్కూలును వదలి పెట్టేంతవరకు ప్రతి రోజూ

నేనే ప్రార్థన చెప్పేవాడిని. ఒకరోజున నేను ఆ స్కూలుని వదలిపెట్టాను.

నేను సాయిని తెలియుము నిక్కముగను
మమత బాయుము యత్నముల్ మానుకొనుము
బాసె మీతోటి బాహ్యసంబంధమింక
కాదు నన్బట్ట ఎటువంటి ఘనునికైన

అని ప్రకటించాను. అందరూ ఆశ్చర్యపోయారు. "రాజూ! రాజూ!" అంటూ నావెంట వచ్చారు. నేను ఎవ్వరికీ జవాబు చెప్పలేదు. ఆంజనేయులు తోటలోకి వెళ్ళి ఒక రాతిగుండుపై కూర్చున్నాను. వచ్చినవారందరికీ "మానస భజరే గురుచరణం దుస్తర భవసాగర తరణం" అని బోధిస్తూవచ్చాను. నేను స్కూలుని వదలిపెట్టిన తరువాత ఆ టీచర్లంతా ఒక మీటింగు పెట్టుకున్నారు. "ఈనాటి నుండి రాజు మన స్కూలుకి రావటం లేదు. రాజులేని స్కూల్లో నేనెందుకుండాలి?" అని తెలుగు టీచరు రిజైను చేశాడు. "ఇంతకాలం ఇక్కడ రాజు ఉన్నాడు కాబట్టి అతనిని చూసుకుంటూ ఆనందంగా కాలం గడుపుతూ వచ్చాను. ఇక్కడ నాకింక పని లేదు" అని మెహబూబ్‌ఖాన్ కూడా రిజైన్ చేశాడు. మరునాడు ఒక మహమ్మదీయ బాలుణ్ణి ప్రార్థనకు నిలబెట్టారు. ఆ పిల్లవాడు స్టేజి ఎక్కాడు. కాని పాట పాడలేదు. స్వామిని తలుచుకొని ఒకే ఏడుపు! అందరూ ఏడ్చారు.

టీచర్సు, పిల్లలు ఒకరికొకరు ప్రేమను పంచుకోవాలి. ప్రేమతో ఎలాంటి గురువునైనా పిల్లలు వశం చేసుకోవచ్చు; గురువులు కూడా పిల్లలను వశం చేసుకోవచ్చు. మనలో ప్రేమ ఉన్నప్పుడే ఎదుటివారు మనలను ప్రేమిస్తారు. పిల్లలయొక్క ప్రవర్తనను, ప్రేమను టీచర్లు చక్కగా అర్థం చేసుకోవాలి. భారతీయ సంస్కృతి అందించే ప్రధానమైన సందేశం – "సత్యం వద, ధర్మం చర." దీనిని ఆచరణలో పెట్టాలి. ఆనాడు టీచర్లు నా తత్త్వాన్ని చక్కగా అర్థం చేసుకున్నారు. నేను కూడా చాలా వినయంగా ఉండేవాడిని. ఇప్పుడు కూడా పిల్లలకు అదే చెబుతాను - You cannot always oblige, but you can speak always obligingly. మంచిమాటలు ఎవరి హృదయాన్నైనా కరిగిస్తాయి. అయితే కొన్నికొన్ని సందర్భాల్లో కఠినంగా చెప్పవలసివస్తుంది. అవసరమైతే నేను వజ్రముకంటే కఠినమే, ప్రేమలో

sri sathyasai vachanamrutam

మాత్రం వెన్నకంటే మెత్తన. అధ్యాపకులారా! మనం పిల్లలను వశం చేసుకోవాలంటే వారిని ప్రేమతో చేరదీయాలి. వారేమైనా తప్పుచేస్తే మంచి మాటలతో వారికి చెప్పాలి. వాళ్ళు మళ్ళీ ఆ తప్పు చేయకుండా చూడాలి. పిల్లలను ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దాలి. అప్పుడు మీరు దేశానికి ఎంతో ఉపకారం చేసినవారవుతారు.

**ప్రశ్న : మురికివాడల్లో నివసించే పిల్లలకు 'ఎడ్యుకేర్' కార్యక్రమం నిర్వహించేదెలా?**

ముఖ్యంగా అలాంటి ప్రదేశాలను పరిశుభ్రం చేయటానికి ప్రయత్నించాలి. దీని నిమిత్తం మీరు సేవాదళ్‌వారి సహాయం తీసుకోవచ్చు. Cleanliness is Godliness అన్నారు. "అపరిశుభ్రత వల్ల మీ పిల్లలకు జబ్బులు వస్తాయి. కాబట్టి మీ పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోండి, అని వారికి చెప్పాలి. మన స్కూలులో వారానికి ఒక దినము 'సోషల్ వర్క్' ఏర్పాటు చేసుకొని, అలాంటి ప్రదేశాలకు వెళ్ళి శుభ్రం చేయాలి. అప్పుడు వారే ముందుకు వచ్చి "మీరు చేయనక్కర్లేదు బాబూ, మేమే చేస్తాము" అంటారు.

**ప్రశ్న : 'ఎడ్యుకేర్' కార్యక్రమంపట్ల చిన్న పిల్లలకు ఉత్సాహంకలిగించేదెలా?**

చిన్నపిల్లలకు 'ఎడ్యుకేర్' కార్యక్రమం నిర్వహించటం సాధ్యం కాదు. కాలేజి స్థాయిలో 'ఎడ్యుకేర్'ను ప్రవేశపెట్టవచ్చు. దానికి పూర్వం పిల్లల మనస్సులో పవిత్రమైన భావాలను అభివృద్ధి చేయాలి. సత్యహరిశ్చంద్రుడు వంటి ఆదర్శ పురుషుల జీవిత చరిత్రలు వారికి బోధించి వారి మనస్సును మార్చాలి.

**ప్రశ్న : భక్తులు కానివారి పిల్లలను ఏవిధంగా ఆకర్షించగలము? స్వామి సందేశాలను ఆచరణలో పెట్టని తల్లిదండ్రులలో ఏవిధంగా మార్పు తెప్పించగలము?**

తల్లిదండ్రులకు సాయిబాబా విషయం తెలియక పోవచ్చుకాని, మన స్కూలుకి వచ్చే పిల్లలకు తెలుస్తుంది. అలాంటి పిల్లలద్వారానే తల్లిదండ్రులకు మంచిమార్గమును బోధించి వారిలో పరివర్తన తెప్పించాలి. "సాయిబాబా ఎంతో మంచిమార్గాన్ని చూపిస్తున్నాడు. నేను సాయిబాబా స్కూలుకి వెళ్ళటంచేతనే మంచివానిగా తయారయ్యాను" అని పిల్లలు చెప్పినప్పుడు తల్లిదండ్రులకు మన విద్యాసంస్థలపట్ల మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. పిల్లలు భోజనం



srisathyasaivachanamrutam

చేయటానికి ముందు "బ్రహ్మార్పణం..." అని ప్రార్థన చేస్తారు. అలా ఎందుకు చేయాలని తల్లిదండ్రులు అడిగితే "భగవంతుడు ఇచ్చిన ఆహారాన్ని మొట్టమొదట భగవంతునికి అర్పితం చేసి తరువాత మనం భుజించాలి. భగవంతునికి అర్పితం చేసినప్పుడు ఆహారంలోని దోషాలు తొలగిపోయి అది ప్రసాదంగా మారిపోతుంది" అని చక్కగా వివరించాలి. అప్పుడు తల్లిదండ్రులు కూడా ప్రార్థన మొదలుపెడతారు. ఇంటికి ఎవరైనా పెద్దలు వచ్చినప్పుడు మన పిల్లలు వారితో వినయ విధేయతలతో మాట్లాడాలి. ఈరీతిగా పిల్లలు స్కూల్లో నేర్చుకున్న మంచివిషయాలను నిత్యజీవితంలో ఆచరణలో పెట్టినప్పుడు వారి తల్లిదండ్రులలో కూడా మార్పు కల్గుతుంది. కనుక మీరు మొట్టమొదట పిల్లలలో మార్పు తెప్పించండి. ఆ పిల్లలే తల్లిదండ్రులలో మార్పు తెప్పిస్తారు.

ఒక చిన్న ఉదాహరణ : ఒక ఇంట్లో ప్రతి వారము మాంసాహారం భుజించేవారు. వాళ్ళ పిల్లవాడు మా విద్యాసంస్థలో చదువుకున్నాడు. వాడు సెలవులకు ఇంటికి వెళ్ళినప్పుడు తల్లి "ఒరే నాయనా! నీవు సంవత్సరమంతా పుట్టపర్తిలో కూర్చుని అసలు మాంసంగాని, చేపలుగాని తినలేదు" అని 'ప్రేమ'తో వానికి మాంసం వడ్డించింది. అప్పుడు వాడు చెప్పాడు – "అమ్మా! నేనీ చెడ్డపని చేయలేను. మన ప్రాణాన్ని నిలుపుకోవటంకోసం ఇతర ప్రాణులను చంపటం మంచిది కాదు. మాంసమయమైన మన దేహానికి తిరిగి మాంసము నందించకూడదు. పవిత్రమైన ఆహారాన్ని భుజించాలి. దుర్గుణములను, దురాచారములను పెంచే జంతుమాంసమును తినకూడదు" అని చెప్పాడు. ఆ పిల్లవాని మాటలు విని తల్లిదండ్రులు కూడా మాంసాహారాన్ని విడిచిపెట్టారు. నేను చాలామందిని చూశాను – మన కాలేజిలో చేరిన పిల్లలవలన వారి తల్లిదండ్రులు కూడా మాంసాహారం మానేశారు. ఈరీతిగా విద్యార్థుల ద్వారా మార్పు తెప్పించటం చాలా సులభం.

**ప్రశ్న : 'ఎడ్యుకేర్' కార్యక్రమంలో తల్లిదండ్రులు కూడా చురుకుగా పాల్గొనేందుకు ఏమి చేయాలి?**

ఈ 'ఎడ్యుకేర్' కార్యక్రమంలో తల్లిదండ్రులను ప్రవేశపెట్టటం సాధ్యం కాదు. చాలామందికి 'ఎడ్యుకేషన్' అంటేనే ఏమిటో తెలియదు. ఇంక 'ఎడ్యుకేర్' అంటే ఏమి అర్థమౌతుంది?

sri sathyasai vachanamrutam

కాబట్టి పిల్లలద్వారానే తల్లిదండ్రులకు బోధించాలి. పిల్లలు దీనిని అర్థం చేసుకొని ఆచరణలో పెట్టినప్పుడు తల్లిదండ్రులుకూడా వారిని అనుసరిస్తారు.

**ప్రశ్న: ఈనాటి విద్యావిధానంలో కంప్యూటర్ టెక్నాలజీ పాత్ర ఏమిటి? దాని ప్రభావమేమిటి?**

ఈ 'టెక్నాలజీ' నాకు కేవలం 'ట్రిక్ నాలెడ్జి'గా కనిపిస్తున్నది. ఈ కంప్యూటర్లపై నాకు అంత నమ్మకం లేదు. ఈనాడు కాదు, ఐదు సంవత్సరాలనుండి నేను చెబుతున్నాను. అన్నింటికీ రోగాలు వస్తున్నట్లుగా కంప్యూటర్లకి కూడా రోగం వస్తుందని చెప్పాను. ఇప్పుడు వచ్చింది. మానవుడు 'కంపోజర్' కావాలిగాని, కంప్యూటర్ కాకూడదు. కంపోజర్ చెడిపోయినప్పుడు కంప్యూటర్ చెడిపోతుంది. ఈనాడు ప్రతి చిన్న విషయానికి కంప్యూటర్‌పై ఆధారపడుతున్నారు. ఒక షాపుకి వెళ్ళి ఒక చీర, రెండు రవికల గుడ్డలు, ఒక టవల్, మూడు హ్యాండ్ కర్చీఫ్‌లు కొంటే, మొత్తం ఎంత డబ్బు అవుతుందో తెలుసుకోవటానికి కేలిక్యులేటర్ ఒత్తుతారు. ఇలా చిన్నచిన్న విషయాలకు సైతం కంప్యూటర్లపై ఆధారపడే బదులు భగవంతుడిచ్చిన తెలివితేటలను ఉపయోగపెట్టుకోవచ్చు కదా! కంప్యూటర్లతో జరిగేవి జరుగుతున్నాయి. కాబట్టి నేను కంప్యూటర్లు వద్దని చెప్పను. కాని ఆయా స్థాయిలకు తగినట్లుగా ఉపయోగించుకోవాలి. క్రొత్తగా వచ్చాయి కదాయని వాటిపై మోజును పెంచుకోకూడదు.

పూర్వం ప్రతి వ్యక్తి తెల్లవారి లేచినది మొదలుకొని రాత్రి పరుండునంత వరకు ఒళ్ళు వంచి పని చేసేవాడు. కాని ఇప్పుడు ఏమైంది? నూరుమంది చేసే పని ఒక కంప్యూటర్ చేస్తున్నది. కాబట్టి ఒక కంప్యూటర్‌వలన నూరుమందికి పని లేకుండాపోతున్నది. చేతినిండా పని లేకపోవటంవలన వారు పెడమార్గం పడుతున్నారు. కనుక అందరికీ పని ఇవ్వాలంటే మొట్టమొదట కంప్యూటర్ల వాడకాన్ని తగ్గించాలి. ప్రతి ఇంటిని ఒక ఫ్యాక్టరీగా చేయాలి. అప్పుడే మనం బాగుపడతాము. ఈ మిషన్లపై అమితంగా ఆధారపడితే ప్రమాదం వస్తుంది.

**ప్రశ్న: ఏ దేశంలోనైనా సత్యసాయి స్కూల్‌ను ప్రారంభించాలంటే ఏమి చేయాలి?**

అందరికీ స్కూల్స్ కట్టటానికి వీలుకాదు. ఎందుకంటే, స్కూల్స్ కట్టించి నడిపించేంత శక్తి సామర్థ్యాలు అందరికీ ఉండవు. కాబట్టి, మొట్టమొదట బాలవికాస్‌ను ప్రారంభించండి.

sri sathyasai vahini amrutam

క్రమక్రమేణ దానిపట్ల ఆకర్షితులై ఆయా గ్రామస్థులే స్కూలు కడతారు. ఎవరి శక్తిని బట్టి వారు పనిచేయాలి. ఈనాడు ఏ దేశంలో చూసినా బాలవికాస్ కార్యక్రమంలో పురుషులకంటే స్త్రీలే చాలా గొప్ప పని చేస్తున్నారు. ఇంట్లో వారివారి కుటుంబపరమైన బాధ్యతలను నిర్వర్తిస్తూ, అంతో ఇంతో కాలం చిక్కినప్పుడు బాలవికాస్‌ను నిర్వహిస్తున్నారు.

ఈ కలియుగంలో బాలవికాస్‌లో పాల్గొన్నవారి అదృష్టమే అదృష్టం. ఈ విషయంలో స్త్రీలు చాలా గొప్ప పని చేస్తున్నారు. పురుషులు కూడా ముందుకు రావాలి. అప్పుడు దేశం ఎంతైనా బాగుపడుతుంది. పెద్దపెద్ద బిల్డింగులు, పెద్దపెద్ద స్కూల్స్ కట్టి లేనిపోని బాధలకు గురి కావద్దు. తక్కువగానే పెట్టుకుందాం. చిన్న ఇల్లు ఉంటే చిన్న వరండా ఉంటుంది. అందులోనే పదిమంది పిల్లలను చేర్చుకొని వారికి మంచి విషయాలను చెప్పండి. "నాయనా! సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలే మానవతా విలువలు. ఇవి లేకపోతే మనం మానవులం కాజాలము" అని చక్కగా బోధించండి. ఈవిధంగా ప్రారంభించి తరువాత స్కూల్స్‌ను అభివృద్ధి పరచుకోవచ్చు.

**ప్రశ్న : ప్రపంచవ్యాప్తంగా ఉన్న సత్యసాయి స్కూల్స్ భవిష్యత్తు గురించి స్వామి సంకల్పమేమిటి?**

ముమ్ముందు ఏవిధంగా ఉంటుందో అని మీరు యోచించనక్కర్లేదు. మీరు చేయవలసింది చేస్తూ రండి. భవిష్యత్తుగురించి మీరు చింతించకండి. అది మీ చేతిలో లేదు. వర్తమానమే ప్రధానం. ఇది 'ఆర్డినరీ ప్రెజెంట్' కాదు, 'ఆమ్నీ ప్రెజెంట్!' కాబట్టి వర్తమానమును మీరు జాగ్రత్తగా చూసుకోండి. భవిష్యత్తు అదే చక్కబడుతుంది. ఈనాడు మీరింతటి ఉన్నతస్థితికి వస్తారని ఏనాడైనా అనుకున్నారా? కాబట్టి వర్తమానంలో మంచి పని చేస్తుంటే అదే భవిష్యత్తులో ప్రమోషన్ ఇస్తుంది.

**ప్రశ్న : సత్యసాయి స్కూల్స్‌లో పిల్లలను K.G. నుండియే చేర్చుకోవాలని నిర్బంధమున్నదా?**

నా ఉద్దేశ్యమేమంటే మీ స్థాయిని బట్టి మీరు ప్రయత్నం చేయవచ్చు. K.G. నుండి కాకపోతే థర్డ్ లేక ఫోర్త్ క్లాసునుండి చేర్చుకోవచ్చు. మీ శక్తిని, అనుకూలాన్ని బట్టి ప్రయత్నించాలి. నిర్బంధమేమీ లేదు.

srisathyasaivachanamrutam

**ప్రశ్న : పాశ్చాత్యదేశాల్లోని సత్యసాయి స్కూల్స్‌లో గాయత్రీమంత్రాన్ని తప్పనిసరిగా పఠించవలెనా?**

ఇది నేను చెప్పను. ఎవరి అభీష్టానికి తగినట్లు వారు చేసుకోవచ్చు. మీ హృదయాన్ని మీరు అనుసరించండి. గాయత్రీ మంత్రమువలన మంచి జరుగుతుందని నమ్మకముంటే తప్పక చేయండి. అయితే గాయత్రి అనేది ఒక స్త్రీ కాదు. ఇదొక దేశానికి, ఒక మతానికి సంబంధించినది కాదు. ఈ మంత్రస్వరూపము ప్రతి మానవునియందు ఉన్నది. 'భూః' – మెటీరియలైజేషన్ (దేహం); 'భువః' – వైబ్రేషన్ (ప్రాణం); 'సువః' – రేడియేషన్ (ఆత్మ). ఈ మూడింటి తత్త్వమే మానవత్వం. కనుక ఏ దేశంవారికైనా, ఏ మతం వారికైనా ఇది అవసరమే. "నా బుద్ధినుండి అజ్ఞానమనే చీకటిని తొలగించి వెలుతురును అందించు. నానుండి దుర్గుణాలను దూరం చేసి నన్ను మంచిమార్గంలో ప్రవేశపెట్టు" అని దీని అర్థం. ఈ ప్రార్థనను ఏ దేశంవారైనా చేయవచ్చును, ఏ వయస్సువారైనా చేయవచ్చును. నేను ఏదీ 'ఫోర్సు' (బలవంతం) చేయను. ఫోర్సు మిలిటరీకి సంబంధించింది. నాదంతా 'సోర్సు'కు సంబంధించినది. అదే ప్రేమ. కాబట్టి మీకు ఏవిధంగా సంతోషం కలిగితే ఆవిధంగా చేయండి.

ముందు జరగవలసిన కార్యక్రమం ఇంకా చాలా ఉన్నది. ప్రశ్నలు ఎక్కువగా ఉన్నాయి. జవాబులు కూడా పెద్దవిగా ఉన్నాయి. కాని సమయాభావంచేత చిన్నవిగా కట్‌చేసి చెబుతున్నాను. ముఖ్యంగా మీరు హృదయాన్ని పరిశుద్ధం చేసుకోండి. దైవాజ్ఞను శిరసావహించండి. దేవుడు ఒకడే. అల్లా అనుకోండి, జీసస్ అనుకోండి, రాముడనుకోండి..... ఎట్టి భేదములూ లేవు. ముఖ్యంగా స్వామిసంస్థల్లో భేదములకు అవకాశమివ్వ కూడదు. దైవాన్ని తలుచుకుంటూ మీ గుణాలను పవిత్రమైనవిగా తీర్చిదిద్దుకోండి. ఈ సత్యసాయిలో కాలినుండి తలవరకు స్వార్థ మనేదే లేదు. కాబట్టి స్వామి ఆజ్ఞను శిరసావహించండి. నేనేది చెప్పినా మీ మంచికోసమే. స్వామి ఆజ్ఞను మీరు అనుసరించి, ఆనందించి, ఆ ఆనందాన్ని పదిమందికి పంచండి. అదే నేను ఆశించేది.

**(21-11-2001 సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasai vahini amrutam